ఎస్పీగారూ.. ఈ ప్రశ్నలకు బదులేది?

- యలమంద ఘటన కట్టుకథ అయితే బడికి వెళ్లాల్సిన బాలుడుని ఎందుకు అరెస్ట్‌ చేశారు?
- ఏమీ జరగనప్పుడు పోక్సో చట్టం కింద కేసు ఎందుకు?
- విద్యార్థికి బెయిల్‌ ఇస్తే బాలిక, కుటుంబీకులపై దాడి చేసే ప్రమాదం ఉందని ఎందుకు చెప్తున్నారు?
- ఎమ్మెల్యే నాని, ఆయన సతీమణిని 5 గంటల పాటు ఎలా అనుమతించారు?
- మాజీ మహిళా మంత్రిని మాత్రం ఎందుకు అనుమతించలేదు?
- బాత్‌రూమ్‌కు వెళ్లినా వదలకుండా బాలిక తండ్రిపై పోలీసు నిఘా ఎందుకు?
- తనను బెదిరించారని బాలిక తండ్రి పోలీసు వలయం నుంచి బయటకు వచ్చి, చెబితే బాధ్యత ఎవరిది?



సాక్షి, టాస్క్‌ఫోర్స్‌: ఎర్రావారిపాళెం మండలం యలమంద ఘటనలో మైనర్‌ బాలికపై దాడి కట్టుకథ అని ఎస్పీ సుబ్బరాయుడు ప్రెస్‌మీట్‌ పెట్టి మరీ ప్రకటించడం, ఇదే ఘటనలో బాధ్యుడిగా బడికి వెళ్లే బాలుడిపై పోక్సో యాక్ట్‌ పెట్టి అరెస్ట్‌ చేయడం, బెయిల్‌ కూడా ఇవ్వవద్దని న్యాయమూర్తిని కోరడంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- కట్టుకథ అని సాక్షాత్తు ఎస్పీ ప్రకటించిన తర్వాత కూడా బాలుడిని ఎందుకు అరెస్ట్‌ చేశారు. బడికి వెళ్లాల్సిన బాలుడు జువైనల్‌ హోమ్‌కు ఎందుకు వెళ్లాడు. బాలుడు బయటకు వస్తే బాధిత బాలికకు, ఆమె కుటుంబానికి, ఇతర బాలికలకు కూడా ప్రమాదం అని ఎందుకు డిటెన్షన్‌ రిపోర్టులో ఎందుకు కోరారు.
- ఆరోజు ఎలాంటి లైంగికదాడి జరగలేదు, ఆలస్యం అయినందుకు బాలిక భయపడింది. అది కవర్‌ చేసుకునేందుకు ×తనను బెదిరించి, మత్తు మందు కలిపి తాగించి, తనపై దాడి చేశారని అబద్ధం చెప్పిందని ఎస్పీ చెప్పినప్పుడు, కేసు రెఫర్‌ చేయాలే కానీ 10వ తరగతి బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు పెట్టమని ఏపీపీకి ఎందుకు సలహా ఇవ్వాల్సి వచ్చింది.
- అపస్మారక స్థితిలో ఉన్న తన బిడ్డను ఎత్తుకుని ఆస్పత్రికి తీసుకువచ్చానని బాలిక తండ్రి చెప్పింది నిజమా? కాదా?
- యలమంద ఆస్పత్రిలో నాలుగున్నర గంటల పాటు బాలికను పరీక్షించిన డాక్టర్ల నివేదికను ఎందుకు డిటెన్షన్‌ రిపోర్టులో పేర్కొనలేదు.
- ఘటన జరిగిన నాటి రాత్రి బాలిక తండ్రి మీడియాతో మాట్లాడిన తర్వాత రోజు నుంచి అతడిని ఎవరూ కలవకుండా, పోలీసులు పర్యవేక్షణ ఎందుకు ఉంది.
- పోలీస్‌ వలయం నుంచి బయటకు వచ్చి, ఈ చేదు ఘటన నుంచి తేరుకున్నాక పోలీసులు, అధికారపార్టీ నేతలు గంటల పాటు బెదిరించారని ఆ బాలిక గాని, తల్లిదండ్రులు కాని చెబితే బాధ్యత ఎవరు వహిస్తారు.
- 4న ఘటన జరిగింది. 11న నివేదిక వచ్చింది. అయితే సున్నితమైన ఈ ఘటనపై పూర్తి స్థాయి నివేదిక రాకుండానే ఏమీ జరగలేదని 5వ తేదీనే మీడియా ముందు ఎస్పీ ఎందుకు ప్రకటించాల్సి వచ్చింది.
- మాజీ మహిళా మంత్రి, పార్లమెంట్‌ సభ్యుడు, టీటీడీ పాలకమండలి మాజీ చైర్మన్‌ స్వయంగా ఆస్పత్రికి వచ్చినా కనీసం చూడడానికి కూడా అనుమతించని పోలీసులు, ఎమ్మెల్యే నాని, అతని భార్యను మాత్రం ఐదు గంటల పాటు ఆస్పత్రిలో ఎలా ఉంచారు.
- బెదిరించారనే, ఒత్తిడికి గురిచేశారనే విమర్శలకు సమాధానం చెప్పగలరా.
- బాలిక బంధువులు, స్నేహితులు, స్కూల్‌ టీచర్లను విచారించినా ఆ విచారణలో ఏమీ లేదని తేలిందని అంటున్న వారు నిజంగా గాయం అయిందా? లేదా? అని చెప్పాల్సిన డాక్టర్లను విచారించారా? అయితే డాక్టర్లు ఏమి చెప్పారనే దానిని ఎందుకు డిటెన్షన్‌ రిపోర్టులో పేర్కొన్నలేదు.
- బాలికపై లైంగికదాడి జరిగిందని ప్రచురించిన అధికార పార్టీ అనుకూల పత్రికలపై కూడా పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తారా.. ఇలా ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, గ్రామస్తులు లేవనెత్తుతున్న పలు సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరముంది.

ఫుట్‌బాల్‌ రాష్ట్ర జట్టుకు జేకబ్‌



తిరుపతి ఎడ్యుకేషన్‌ : అనంతపురం ఆర్‌డీటీ మైదానంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు సంతోష్‌ ట్రోఫీ పేరిట జాతీయ స్థాయి ఫుట్‌బాల్‌ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్రజట్టుకు తిరుపతి ఎస్వీసీఈ కళాశాలకు చెందిన బీటెక్‌ విద్యార్థి జేకబ్‌ హెరాల్డ్‌ ఎంపికయ్యారు. విద్యార్థి తండ్రి డాక్టర్‌ నోయల్‌ వినోద్‌ సైతం ఒకప్పటి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌ క్రీడాకారుడు కావడం విశేషం. జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్న జేకబ్‌కు జిల్లా ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ సభ్యులు రెడ్డప్ప, శ్రీనివాసులు, కోచ్‌లు వెంకటరాములు, రాజు, వినోద్‌ అభినందనలు తెలిపారు.

తలకోనలో అర్చకుల ఘర్షణ

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ఘర్షణ పడ్డారు. ఈ నెల 4వ తేదీన జరిగినట్లుగా భావిస్తున్న ఘటన ఆలయ సీసీ కెమెరాల్లో నమోదైంది. వివరాలు.. ఆలయ అర్చకులు శివప్రసన్నశర్మ, ప్రసాద్‌ అన్నదమ్ములు. వీరి కుటుంబాల్లో ఏదైనా అసౌకర్యం ఏర్పడితే ఆలయ కార్యక్రమాలు యథావిధిగా సాగేందుకు ఒక పరిచారకుడిని నియమించాలని ధర్మకర్తల మండలి, ఈఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే శివప్రసన్నశర్మ ఏకపక్షంగా తన కుమారుడు మనోజ్‌ను పరిచారకుడిగా నియమించడంతో మరో అర్చకుడు ప్రసాద్‌ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంలోనే ఇరువురు అర్చకులు గొడవ పడినట్లు సమాచారం. దీనిపై ఇద్దరికీ మెమోలు జారీ చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ మమత వెల్లడించారు.

సాయిబాబా హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్‌ : కొంకావీధిలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో హుండీ లెక్కింపును మంగళవారం చేపట్టారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, సాయిబాబా సేవా సమాజ్‌ ఆధ్వర్యంలో కానుకలు లెక్కించగా మొత్తం రూ.4,27,660 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమాజ్‌ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం, బాలకృష్ణ, దుర్గం శ్రీనివాస్‌, మర్దం శివ, సి.రమేష్‌, పి.విజయలక్ష్మి, హరిబాబు, శీను, కె.ప్రభాకర్‌, పి.రాజమణి పాల్గొన్నారు.

భార్యపై కోపంతో అతివేగంగా వెళుతూ..

- పాల వ్యాన్‌ను ఢీకొట్టిన బైక్‌
- భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మధు

తిరుపతి రూరల్‌: ఇంట్లో భార్యభర్తల మధ్య నెలరోజులుగా మనస్పర్థలు నెలకొన్నాయి. అలిగి సొంత ఊరు వెళ్లిన భర్త మనసు మార్చుకుని వచ్చి, కలిసి ఉందామంటూ బతిమలాడాడు. భార్యతో కలిసి ఊరికి బయలుదేరాడు. తీరా కొంత దూరం వెళ్లిన తర్వాత బైక్‌ పైనే ఇద్దరి మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో భార్యపై కోపంతో బైక్‌ను అతివేగంగా నడిపాడు. అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న పాలవ్యాన్‌ను బైక్‌ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో భర్త చనిపోగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం తిరుపతి రూరల్‌ మండలం తాటితోపు వద్ద చోటుచేసుకుంది. తిరుపతి రూరల్‌ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఐరాల మండలం నెల్లిమందకు చెందిన సురా మధు (40) మేస్త్రీ పని చేస్తుంటాడు. అతని భార్య గాయత్రి తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరు జీవకోనలో నివాసం ఉంటున్నారు. మంగళవారం సొంత గ్రామానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన గాయత్రిని స్థానికులు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోలీసులు ఎస్వీ మెడికల్‌ కళాశాల మార్చురీకి తరలించారు.

పోటాపోటీగా అంతర్‌ కళాశాలల క్రీడా పోటీలు

తిరుపతి సిటీ: ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా రెండు రోజులుగా జరుగుతున్న ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ అంతర్‌ కళాశాలల క్రీడా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18 వ్యవసాయ కళాశాలల విద్యార్థులు పలు విభాగాల్లో పోటీపడ్డారు. వాలీబాల్‌, బాల్‌ బ్యాడ్మింటన్‌, క్యారమ్స్‌, బాస్కెట్‌ బాల్‌, చెస్‌ విభాగాల్లో విద్యార్థులు సత్తా చాటుతున్నారు. బుధవారం జరగనున్న ఫైనల్‌ మ్యాచ్‌ల్లో విజేతల ఎవరనేది తేలనుంది. వ్యవసాయ కళాశాల అసోసియట్‌ డీన్‌ డాక్టర్‌ ఎంవీ రమణ, ఫిజికల్‌ డైరెక్టర్‌ రవికాంత్‌ రెడ్డి టోర్నమెంట్‌ను పర్యవేక్షిస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసి క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కళాశాలలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

కో–ఆప్షన్‌ సభ్యుడికి భూమన పరామర్శ



ఖాదర్‌ బాషాను పరామర్శిస్తున్న భూమన

తిరుపతి తుడా : నగరంలోని గాలివీధికి చెందిన కార్పొరేషన్‌ కో–ఆప్షన్‌ సభ్యుడు ఖాదర్‌బాషా అస్వస్థతకు గురై పద్మావతి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఫ్యాకల్టీ ఇండక్షన్‌ కార్యక్రమం ప్రారంభం



రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న ఎంఎంటీటీసీ సభ్యులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని మిషన్‌ మాలవ్య టీచర్‌ ట్రైనింగ్‌ సెంటర్‌(ఎంఎంటీటీసీ)లో నెలరోజుల పాటు జరిగే ఆన్‌లైన్‌ ఫ్యాకల్టీ ఇండక్షన్‌ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్‌ భూపతి నాయుడు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సాంకేతిక విప్లవాలతో విద్యావిధానం, బోధనలో నూతన ఒరవడులు వస్తుంటాయన్నారు. వాటిని ఆకలింపు చేసుకుని, అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. అధ్యాపకులకు అధునాతన అంశాలపై శిక్షణ అవసరమన్నారు. ఈ శిక్షణలో దేశవ్యాప్తంగా 60 మంది అధ్యాపకులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అనంతరం ఎంఎంటీటీసీ సభ్యులు రిజిస్ట్రార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌ ఆర్పీ విజయలక్ష్మి, కోర్సు కోఆర్డినేటర్లు రాధిక, హేమలత, రుద్రమదేవి, సునీత పాల్గొన్నారు.

18న సచివాలయాల వద్ద ధర్నా

తిరుపతి కల్చరల్‌ : పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీన సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో నగర సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు హామీని అమలు చేయకపోవడం దారుణమని విమర్శించారు. ధర్నాలో పేదలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సాఫ్ట్‌ కాంపోనెంట్‌ స్టెమ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఐజర్‌ అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళావర్సిటీ వేదికగా ప్రధానమంత్రి ఉచ్చతర్‌ శిక్ష అభియాన్‌(పీఎమ్‌యూ) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మంగళవారం సాఫ్ట్‌ కాంపోనెంట్‌ స్టెమ్‌ అవేర్నెస్‌ అండ్‌ కెరియర్‌ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐజర్‌ నుంచి డాక్టర్‌ అరుణనిమ బెనర్జీ, డాక్టర్‌ వసుధారాణి, డాక్టర్‌ బలరామన్‌, డాక్టర్‌ సుభాష్‌ విచ్చేసి భౌతిక, రసాయన, జీవ, గణిత శాస్త్రాల్లోని పాఠ్యాంశాలలో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీన్లు ప్రొఫెసర్‌ సి.వాణి, సుజాత, ప్రొఫెసర్‌ కె అనురాధ, వజీహ కమిటీ సభ్యులు, వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

15న తిరుపతికి శృంగేరి పీఠాధిపతి

తిరుపతి కల్చరల్‌ : లోకకల్యాణార్థంలో భాగంగా చేపట్టిన యాత్రలో భాగంగా శృంగేరి శంకర మఠం పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ఈనెల 15వ తేదీన తిరుపతికి విచ్చేస్తున్నట్లు నగరంలోని శృంగేరి శంకర మఠం కార్యదర్శి జీఎల్‌ మనోహర్‌ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల 14వ తేదీన మహాస్వామి తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని అక్కడే రాత్రి బస చేస్తారన్నారు. 15న ఉదయం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని, మంచినీటిగుంట వద్ద శివాలయంలో స్వామివారిని దర్శించుకుని అనంతరం కోదండరాముని ఉత్తమాడ వీధిలో ఉన్న శృంగేరి శంకర మఠానికి చేరుకుంటారని వివరించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేయనున్నట్లు తెలిపారు. రాత్రి 8 గంటలకు శ్రీచంద్రమౌళీశ్వర పూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పూర్ణ చంద్రరావు, సూర్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

సుధాకరయ్యకు అవార్డు



తిరుపతి సిటీ : ఎస్వీయూ ప్రొఫెసర్‌ ఏ.సుధాకరయ్యకు మంగళవారం కేరళలోని అసోసియేషన్‌ ఆఫ్‌ రీసెర్చర్స్‌ అండ్‌ అకామిడేషన్స్‌ ఇండియా సంస్థ రామానుజన్‌ అవార్డును ప్రకటించింది. వర్సిటీ రిజిస్ట్రార్‌ భూపతినాయుడు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నానీకి డాక్టరేట్‌



తిరుపతి సిటీ : మహిళా వర్సిటీ పరిశోధక విద్యార్థిని బి.నానికి డాక్టరేట్‌ ప్రదానం చేశారు. అధ్యాపకులు సునీత బాయి మార్గదర్శకత్వంలో 'యాంక్సిటీ అండ్‌ అకాడమిక్‌ స్ట్రెస్‌ ఇన్‌ రిలేషన్‌ టు అకాడమిక్‌ అచీవ్‌మెంట్‌ అఫ్‌ సెకండరీ స్కూల్‌ స్టూడెంట్స్‌' అనే అంశంపై ఆమె పరిశోధనా పత్రాలు సమర్పించారు.

దేశభక్తి.. క్రమశిక్షణే ఎన్‌సీసీ ప్రధాన లక్ష్యం

తిరుపతి సిటీ: విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణను నేర్పి, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే ఎన్‌సీసీ ప్రధాన లక్ష్యమని కమాండింగ్‌ ఆఫీసర్‌, కర్నల్‌ ఆర్‌ అనూప్‌ పేర్కొన్నారు. మంగళవారం వెటర్నరీ వర్సిటీలోని ఎన్‌సీసీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి 2ఏ ఆర్‌ అండ్‌ బీ రెజిమెంట్‌ ఎన్‌సీసీ కమాండింగ్‌ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకోవడం సంతోషకరమన్నారు. శ్రీవారి పాదాల చెంత పనిచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని, తిరుపతి ఎన్‌సీసీ రెజిమెంట్‌ను మరింత అభివృద్ధి చేసే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుపతి ఎన్‌సీసీ వింగ్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మరింత మంది విద్యార్థులను ఎన్‌సీసీలో భాగస్వామ్యులను చేసి, శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 320 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు హార్స్‌ రైడింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇప్పటికే తిరుపతి వింగ్‌ నుంచి సుమారు నలుగురు విద్యార్థులు ఢిల్లీలో జరిగే నేషనల్‌ పెరేడ్‌కు ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

ఆహాకారం

- హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు
- వెలుగు చూసిన భయానక వాస్తవాలు
- దారుణంగా వంట గదులు
- కుళ్లిన ఆహారపదార్థాలు



హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి తుడా : తిరుపతి నగరంలోని నగరంలోని పలు హోటళ్లపై ఆహార భద్రతాధికారి ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భయం గొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. ఆహార పదార్థాల తయారీలో వాడే నిషేధిత రంగులను గుర్తించారు. ఫ్రిజ్‌లో రోజుల తరబడి నిల్వ చేసిన మాంసం, కుళ్లిన కూరగాయలను చూసి అధికారులు నిర్ఘాంతపోయారు. అపరిశుభ్రంగా దారుణమైన స్థితిలో ఉన్న వంట గదులను పరిశీలించి షాక్‌ తిన్నారు. ఈ మేరకు రెండు హోటళ్లపై కేసులు సైతం నమోదు చేశారు. ఆహార భద్రతాధికారి మద్దిలేటి, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి. రాజారెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్‌ నిర్వాహకులపై ఉందని తెలిపారు. కేవలం లాభాపేక్షే కాకుండా నైతిక విలువలు కూడా పాటించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయిస్తే రూ.లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు జరిమానాతో పాటు 6 నెలల జైలు శిక్ష ఉంటుందని స్పష్టం చేశారు. ఇకపై నిరంతరం దాడులు కొనసాగుతాయని తెలిపారు. హోటళ్లలో ఫుడ్‌ కొనుగోలు చేసేప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌, ప్రతినిధులు దేవేంద్ర, గిరి, సిబ్బంది సుమన్‌ పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడుపు పెంపునకు వినతి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ దూర విద్యా పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంచాలని విద్యార్థి సంఘాల నేతలు కోరారు. మంగళవారం ఈ మేరకు రిజిస్ట్రార్‌ భూపతినాయుడుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు ఫీజు చెల్లించలేకపోయారన్నారు. తమ విన్నపంపై రిజిస్ట్రార్‌ స్పందించి ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించారని వెల్లడించారు. నేతలు మన్నం ప్రేమ్‌కుమార్‌, కొండ యుగంధర్‌, అమృత్‌ తేజ, రూకేష్‌, సుకుమార్‌, ముని, నరేష్‌, వెంగళరావు, లిఖిత్‌, సాయి, మురళి, దినేష్‌, సంపత్‌ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం

తిరుపతి కల్చరల్‌ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా కామాక్షి అమ్మవారి చండీహోమం నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో హోమ మహోత్సవాలు చేపడుతున్నారు. అందులో భాగంగా యాగశాలలో ఉదయం పూజ, నిత్యహోమం, చండీహోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి సమర్పించారు. సాయంత్రం హోమం, చండీ పారాయణం, సహస్రనామార్చన, విశేష దీపారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని సేవించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

ఉత్తమ వాకర్స్‌కు సత్కారం

తిరుపతి కల్చరల్‌ : వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ మాజీ గవర్నర్‌ ఆర్కాట్‌ కృష్ణప్రసాద్‌, దివ్యారామం వాకర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 80 ఏళ్ల పైబడిన ఉత్తమ వాకర్స్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. కృష్ణప్రసాద్‌ మాట్లాడుతూ యువతకు సైతం స్ఫూర్తినిస్తున్న సురేష్‌, మొగిలప్ప నాయుడు, వెంకటరమణరెడ్డిని సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. శేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఆదం దశరథ రామిరెడ్డి, హేమచంద్‌, ఎల్లయ్య, డాక్టర్‌ నారప్పరెడ్డి , రామచంద్రారెడ్డి, పతంజలి యోగా సమితి నేతలు కైలాష్‌ సింగ్‌, ఓటేరు కృష్ణ, శేషాద్రి పాల్గొన్నారు.

రుద్రకోటి సదాశివకు అభినందన

తిరుపతి(అలిపిరి): నాయీబ్రాహ్మణ కార్పొరేషన్‌ చైర్మన్‌గా నియమితులైన రుద్రకోటి సదాశివకు టీటీడీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చీర్ల కిరణ్‌ అభినందనలు మంగళవారం తెలిపారు. పవన్‌, పెరుమాళ్‌, చిన్ని, మునీంద్ర, కేశవ, ఉమా, గుణ, శివాజీ, భాను, వెంకటేష్‌, రామనాథం పాల్గొన్నారు.

బెల్టుపై నిరంతర దాడులు

తిరుపతి రూరల్‌: పల్లెల్లో తిష్ట వేసిన బెల్టు షాపులపై అధికారుల దాడులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తిరుపతి రూరల్‌ ఎక్సైజ్‌ సర్కిల్‌ అధికారులు పలుచోట్ల దాడులు చేశారు. రేణిగుంట మండలం ఆర్‌ మల్లవరం గ్రామానికి చెందిన చిన్నహనుమంత నాయుడు భార్య మునిరత్నమ్మ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్‌ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లను సీజ్‌ చేశారు. మొదటిసారి పట్టుపడడంతో ఆమెపై హిస్టరీ షీట్‌ను సైతం ఓపెన్‌ చేసినట్లు తిరుపతి రూరల్‌ ఎక్సైజ్‌ సీఐ నరసానాయుడు తెలిపారు. మద్యం బాటిళ్లపై ఉన్న బ్యాచ్‌ నంబర్‌ ఆధారంగా ఏ షాపు నుంచి ఆమె నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లను తెచ్చి విక్రయిస్తుందన్న విషయంపై ఎక్సైజ్‌ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌ ఎస్‌ఐలు కవీశ్వర్‌ నాయుడు, అంజలి ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

తిరుపతి రూరల్‌ : తిరుచానూరు తోలప్పగార్డెన్స్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ చంద్రశేఖర్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరుచానూరు టౌన్‌, యోగి మల్లవరం, సన్నిధి వీధి, వసుంధరానగర్‌, వైష్ణవినగర్‌, శంకర్‌నాయుడుకాలనీలో విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అ'న్యాయ'ంగా ఫీజులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న లా కళాశాలలపై విద్యార్థి సంఘాల నేతలు మంగళవారం రిజిస్ట్రార్‌ భూపతినాయుడుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా ఆర్‌కేఎమ్‌, కేకేసీ లా కళాశాలలు ఫ్రీ సీటు వచ్చిన విద్యార్థుల నుంచి కూడా రూ.30వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయా కళాశాలల యాజమాన్యాల ఆగడాలు శృతి మించాయని, తల్లిదండ్రులను తీవ్రంగా వేధిస్తున్నాయని మండిపడ్డారు. వెంటనే ఆ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు జె.మల్లికార్జున, శివశంకర్‌ నాయక్‌, విజయ్‌, భార్గవ్‌ సాయి, బాలాజీ నాయక్‌, అశోక్‌, వెంకటాద్రి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

తిరుపతి తుడా : తిరుపతి స్మార్ట్‌ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్మార్ట్‌ సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్‌ మౌర్య ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్‌ కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై ప్రాజెక్టుల నిర్మాణ కంపెనీ ప్రతినిధులు, స్మార్ట్‌ సిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. నాలుగు మెగావాట్ల ఫ్లోటింగ్‌ సోలార్‌ ప్రాజెక్టు, సిటీ ఆపరేషన్‌ సెంటర్‌, ఇంటిగ్రేటెడ్‌ కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌, శ్రీనివాస సేతు పనుల పురోగతిపై అఫ్కాన్స్‌, మల్టీ లెవల్‌ కార్‌ పార్కింగ్‌ నిర్మాణ సంస్థల ప్రతినిధులు వివరించారు. సమావేశంలో ఎస్‌ఈ శ్యామ్‌సుందర్‌, స్మార్ట్‌ సిటీ జీఎం చంద్రమౌళి పాల్గొన్నారు. అశోక్‌, వెంకటాద్రి పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

తిరుపతి కల్చరల్‌ : వ్యాయామంతో ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని ఆర్‌ఆర్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు రమణ తెలిపారు. చెన్నైలో జరిగిన మిస్టర్‌ ఇండియా పోటీల్లో రెండవ స్థానం దక్కించుకున్న తిరుపతికి చెందిన వ్యాయమ శిక్షకుడు కుమార్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిమ్‌ మాస్టర్‌ సోనీ, శరత్‌ చౌదరి పాల్గొన్నారు.

'రుద్రపాదాల ముక్కోటి'కి శ్రీకారం

చంద్రగిరి : తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన ఆనందవల్లీ సమేత శ్రీఅగస్త్యేశ్వర స్వామి వారి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలకు మంగళవారం వైభవంగా శ్రీకారం చుట్టారు. ఈ నెల 20వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. సాయంత్రం మూషిక వాహనంపై శ్రీవినాయక స్వామివారు ఊరేగారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పర్యవేక్షించారు.

ప్రెస్‌క్లబ్‌ అభివృద్ధికి సహకారం

తిరుపతి తుడా : తిరుపతి ప్రెస్‌ క్లబ్‌ అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని కార్పొరేషన్‌ కమిషనర్‌ మౌర్య తెలిపారు. ప్రెస్‌ క్లబ్‌ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి కచ్చపి ఆడిటోరియం కేటాయించిన కమిషనర్‌కి మంగళవారం కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమెను సత్కరించి జ్ఞాపిక అందించారు. ప్రెస్‌ క్లబ్‌ సెక్రటరీ బాలచంద్ర, ఉపాధ్యక్షులు ప్రకాష్‌ బాబు, లావణ్యకుమార్‌, జాయింట్‌ సెక్రటరీ జగదీష్‌ పాల్గొన్నారు.

వేమూరులో తమిళనాడు రైతులు

తిరుపతి రూరల్‌ : మండలంలోని వేమూరులో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం తమిళనాడు రైతులు సందర్శించారు. వ్యవసాయ పద్ధతులు, పంటల సాగు, దిగుబడి, మార్కెటింగ్‌ సౌకర్యాలపై ఆరా తీశారు. సేంద్రియ సేద్యం విధానాలను ఆదర్శ రైతు దామా అయ్యప్పనాయుడు వివరించారు.

నేడు నరసింగాపురంలో పడిపూజ

చంద్రగిరి : కార్తీక మాసంలో అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు బుధవారం నరసింగాపురంలో పడి పూజ నిర్వహించనున్నారు. సుమారు రూ.3.5లక్షల వ్యయంతో భారీ ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక తోరణాలు, విద్యుత్‌ కటౌట్లు, దీపాలంకరణ, కేరళ వాయిద్యాలు, గుంటూరుకు చెందిన కళాకారుల ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పడి పూజ, కన్నె పూజలను జరిపించేందుకు కేరళలోని శబరిమలై అయ్యప్ప స్వామివారి ఆలయానికి చెందిన అర్చకులు త్రివిక్రమన్‌ నంబూద్రి, ఐతేపల్లెకు చెందిన చంద్ర గురుస్వామి హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా 500 మందికి అన్నదానం చేపట్టేందుకు సన్నాహాలు పూర్తి చేసినట్లు తెలిపారు.

జపాన్‌ బృందంతో మహిళావర్సిటీ అధికారుల భేటీ

తిరుపతి సిటీ: ఉన్నత విద్యలో కలసి పనిచేసేందుకు ప్రభుత్వం జపాన్‌కు చెందిన విద్యాసంస్థను రాష్ట్రానికి ఆహ్వానించింది. ఇందులో భాగంగా విజయవాడ ఆచార్య ఎన్జీరంగా వర్సిటీలో పర్యటిస్తున్న జపాన్‌ బృందాన్ని మహిళా వర్సిటీ అధికారులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్‌ వి ఉమ మాట్లాడుతూ జపాన్‌ టోయామా ప్రిఫెక్చర్‌తో విద్యా సహకారాన్ని బలపరచడానికి కృషి చేస్తోందన్నారు. ఓఎంయూ కుదుర్చుకోవడంతో కలసి పనిచేసే అవకాశం ఉంటుందన్నారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు

తిరుపతి మంగళం : తిరుపతి నగర, శివారు ప్రాంతాల్లోని చెరువులు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించేందుకు చర్యలు చేపట్టామని ఇరిగేషన్‌ ఏఈ అనిత తెలిపారు. మంగళవారం ఈ మేరకు తిమ్మినాయుడుపాళెంలోని పాన్‌ చెరువు వద్ద రెవెన్యూ, ఇరిగేషన్‌, మున్సిపల్‌ శాఖ అధికారులు జాయింట్‌ సర్వే నిర్వహించారు.